పాతసంచులతో పరేషాన్



రోడ్డుపై పడిపోయిన ధాన్యాన్ని సేకరిస్తున్న రైతులు(ఫైల్)



ట్రాక్టర్‌లో కొత్త గన్నీ సంచులను బియ్యానికి తరలిస్తున్న నిర్వాహకులు(ఫైల్)

- మిల్లులకు తరలిస్తుండగా చినిగిపోతున్న బస్తాలు
- రోడ్డుపై పడిపోతున్న ధాన్యం, మళ్లీ సేకరణకు రైతులకు అదనపు ఖర్చు

శంకరపట్నం: కొనుగోళ్ల కేంద్రాల్లో పాత సంచుల్లో ధాన్యం నింపి తూకం వేసి ట్రాక్టర్లలో మిల్లులకు తరలిస్తుండగా మార్గమధ్యలో ధాన్యం బస్తాలు రోడ్డుపై పడిపోతున్నాయి. ధాన్యం తరలిస్తుండగా పాత గన్నీ సంచులు బరువుకు చిరిగిపోతున్నాయి. రోడ్డుపై పడిపోయిన ధాన్యం మళ్లీ కుప్పగా పోసి మరో సంచుల్లో నింపి మిల్లుకు తరలించేందుకు రైతులు అదనంగా ఖర్చు భరించాల్సి వస్తుందని వాపోతున్నారు. కొత్త సంచుల్లో ధాన్యం నింపి కాంటా వేసి మిల్లులకు తరలించాలని, ప్రభుత్వం పంపిన కొత్త గన్నీ సంచుల్లో బియ్యం నింపేందుకు మిల్లులకు పంపించి, పాత గన్నీ సంచులు మిల్లుల నుంచి తెచ్చిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం పంపిన కొత్త గన్నీ సంచుల్లోనే ధాన్యం నింపి తూకం వేయాలని ఆయా రైతులు డిమాండ్ చేస్తున్నారు.



హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని జమ్మికుంట రోడ్డులో అయ్యప్పస్వామి గుడి ఎదురుగా మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతుంది. సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సమ్మయ్య, హుజూరాబాద్ కమిషనర్, సెల్ నంబర్ 70326 51516

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

క్లుప్తంగా

స్టడీ అవర్ పరిశీలన



మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రావు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అదనపు స్టడీ అవర్‌ను జిల్లా విద్యాధికారి (డీఈవో) జనార్దన్‌రావు బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈసందర్భంగా హాజరైన విద్యార్థుల వివరాలు, బోధన సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు రాయికంటి రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య తెలుగు మీడియంలో కొనసాగాలి

సైదాపూర్: తెలంగాణలో ప్రాథమిక విద్య తెలుగు మీడియంలోనే కొనసాగాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర సహాధ్యక్షుడు నాగుల భిక్షపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వెన్కెపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో మండల ఉపాధ్యాయ పండిత పరిషత్ కార్యవర్గ సమావేశం జరిగింది. ప్రాథమిక పాఠశాల స్థాయిలో హిందీ ఉపాధ్యాయులను నియమించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 317 జీవో ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా నరేంద్రాచారి, ఉపాధ్యక్షుడిగా రమాదేవి, కుమార్, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల శర్మ, కార్యదర్శిగా జహూర్, దీపిక, జిల్లా ప్రతినిధిగా రవినాయక్‌లను నియమించినట్లు భిక్షపతి తెలిపారు.

సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలో సామాజిక సర్వేను బుధవారం ఆర్డీవో రమేశ్‌బాబు పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ఫారంలో నమోదు చేస్తున్న వివరాలను తనిఖీ చేశారు. కార్యక్రమలో తహసీల్దార్ కనకయ్య, ఆర్ఐ రంజిత్, పంచాయతీ కార్యదర్శి జయేందర్‌లున్నారు.

మార్కెట్ కమిటీ నియామకం

శంకరపట్నం: అమాత్యుల సహకారంతో హుజూరాబాద్ మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకమైందని మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కేశవపట్నంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన నాంపల్లి తిరుపతి వైస్‌చైర్మన్, కేశవపట్నం గ్రామానికి చెందిన రైస్‌మిల్ వ్యాపారి తనుకు ప్రభాకర్‌ను డైరెక్టర్‌గా నియమించారని, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, హుజూరాబాద్ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బస్వయ్య, తిరుపతి, రాజయ్య, బండారి తిరుపతి, సదానందం, తిరుపతిరెడ్డి, షారూఖ్ తదితరులున్నారు.

కమిటీకి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ చైర్ పర్సన్‌గా పుల్లూరి స్వప్న సదానందం, వైస్ చైర్మన్‌గా సతీష్‌రెడ్డి నియామకమయ్యారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేశినికోటి ఆధ్వర్యంలో నాయకులు బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాజ్ కుమార్, శంకర్, నాయకులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



దాతలకు రశీదు ఇస్తున్న బుచ్చిరాములు

జమ్మికుంట: పట్టణంలోని సాయి మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలకు ప్రముఖ కంటి వైద్య నిపుణుడు చిట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆయన మనవడు వివేకానందరెడ్డి బుధవారం సందర్శించి రూ.25వేలు విరాళంగా అందజేశారు. పిల్లల మోటివేషన్, ఐక్యూ పెంచడం, ప్రత్యేక ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల పాత్ర తదితర విషయాలపై శ్రీనివాస్‌రెడ్డి సూచనలు చేశారు. అనంతరం పిల్లలు పుష్ప గుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు, నిర్వాహకులు సూత్రపు బుచ్చిరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టానికి అందరూ సమానమే

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్

గంగాధర: చట్టానికి అందరూ సమానమేనని, చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని కరీంనగర్ సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ సూచించారు. మండలంలోని మధురానగర్ చౌరస్తా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అందరికి అందుబాటులో న్యాయం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చట్టానికి కుల, మత, లింగ, వర్ణ బేధాలు లేవని ప్రతి పౌరుడి సంక్షేమమే చట్టం యొక్క ముఖ్య విధి అని పేర్కొన్నారు. విద్యార్థులు సమస్యల పట్ల చట్టాన్ని ఏ విధంగా ఆశ్రయించాలో వివరించారు. విద్యార్థులు చెడువ్యసనాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ మహేశ్, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాంజనేయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో..

రామడుగు మండలం వెదిరలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలల సంరక్షణ, బాల్యవివాహాల నిరోధకం, బాలకార్మికుల నిర్మూలన చట్టం, సైబర్‌క్రైం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కవిత, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏఎస్ఐ కమల

హుజూరాబాద్‌రూరల్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ కమల అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్, ఉమెన్ ట్రాఫికింగ్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తుపదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి అవగాహన కల్పించారు. అపరిచితులు ఫోన్ చేసి బ్యాంక్ ఖాతా వివరాలు అడిగితే చెప్పొద్దని, మోసపూరిత లింకులు ఓపెన్‌చేయొద్దని వివరించారు.

నియామకం



జడల అశోక్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి గ్రామానికి చెందిన జడల అశోక్‌ను తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర నూతన కమిటీ కార్యవర్గంలో కార్యదర్శిగా నియమిస్తూ బుధవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఉత్తర్వులు జారీ జారీ చేశారు. నియామకానికి కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



జమ్మికుంట: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు,



రామడుగు: అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల విద్యార్థులు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని స్పోర్ట్స్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జోనల్ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నల్లగొండ సదానందం తెలిపారు. పదో తరగతికి చెందిన ఆకాశ్ 67, తొమ్మిదో తరగతి విద్యార్థి సాయిచరణ్ 49, ఎనిమిదో తరగతి విద్యార్థిని సన 40 కేజీల కేటగిరిలో అత్యంత ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఎంఈవో హేమలత, ఫిజికల్ డైరెక్టర్ ప్రేమలత, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట ఆల్ఫోర్స్ పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి శశివర్ధన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడని విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి తెలిపారు. అండర్ –14 విభాగంలో కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్ నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్‌జంప్ విభాగంలో ప్రతిభ కనబరిచాడని, ఈ నెల 16, 17వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని వివరించారు. విద్యార్థిని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అభినందించారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం



సదానందంను సన్మానిస్తున్న పద్మశాలీ, చేనేత ఐక్య వేదిక నాయకులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బండారి సదానందం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియామకమయ్యారు. ఈమేరకు బుధవారం పద్మశాలీ సంఘం మండల, రాష్ట్ర చేనేత ఐక్య వేదిక నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు సంగెం సత్యనారాయణ, చేనేత ఐక్య వేదిక నాయకులు జడల చిరంజీవి, కుడికాల సాయి, ఇప్పలపల్లి చంద్రశేఖర్, కాయల సాగర్ తదితరులున్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

హుజూరాబాద్‌రూరల్: పట్టణ పరిధిలోని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు గ్యాస్ వాడకంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అంబు జా గ్యాస్ నిర్వాహకులు మధన్‌మోహన్ గ్యాస్ వాడకం, సంరక్షణ చర్యలు వివరించారు. గ్యాస్ ప్రమాదాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ దేవేందర్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం లావణ్య, సిబ్బంది ఉన్నారు.

బీజేపీ సంస్థాగత నిర్మాణానికి కృషి చేయాలి



భాస్కరాచారిని సన్మానిస్తున్న నాయకులు

ఇల్లందకుంట: బీజేపీ సంస్థాగత నిర్మాణానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో సంస్థగత ఎన్నికల వర్క్‌షాప్, మండల కార్యవర్గ సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అధిష్టానం ఆదేశాల మేరకు బూత్ స్థాయి ఆపై నాయకులు వంద సభ్యత్వాలు నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని కోరారు. అనంతరం నాయకులు భాస్కరాచారిని శాలువాతో సన్మానించారు. నాయకులు ఎల్లారెడ్డి, రాంబాబు, రమేశ్, శ్రీనివాస్, పవన్‌రెడ్డి, రాజేందర్, దుర్గయ్య, సతీష్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.51 వేల విరాళం



విరాళం అందిస్తున్న భక్తుడు

చొప్పదండి: పట్టణంలోని సాయిబాబా ఆలయ అభివృద్ధికి చొప్పదండికి చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు సిరిపురం నాగభూషణం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సుమన్, ప్రశాంతి దంపతులు బుధవారం ఆలయ ట్రస్టు చైర్మన్ గుర్రం హన్మంతరెడ్డికి రూ.51 వేల విరాళం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ట్రస్టు కోశాధికారి దండె లింగన్న, సహాయ కార్యదర్శి దూస రాము, కార్యవర్గ సభ్యులు దూస లక్ష్మీనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ



చిగురుమామిడి: మండల కేంద్రంలో బుధవారం సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశామని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి పూల లచ్చిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలోపార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు వంగ కనకయ్య, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పోలు స్వప్న, బీసీ సెల్ అధ్యక్షుడు పొన్నం సంపత్, నాయకులు కవ్వంపల్లి సంజీవ్, నరసిరెడ్డి, జ్యోతి, బాలకృష్ణ చారి పలువురు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం సందర్శించిన విద్యార్థులు



చొప్పదండి: మండలంలోని రెవెళ్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. దళారులతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ధాన్యం తూకం, ధరలు, బోనస్, తాలు, తరుగు విధానం గూర్చి సీపీ భాగ్య వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆనందం, ఉపాధ్యాయులు సుమలత, రోజారాణి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు ఆసరాపై విచారణ



విచారణ చేస్తున్న డీఆర్‌డీఏ శ్రీధర్

ఇల్లందకుంట: మండలంలోని మల్లివానిపల్లిలో అనర్హులకు ఆసరా పెన్షన్‌పై కరీంనగర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వరుణ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం క్షేత్రస్థాయిలో డీఆర్‌డీఏ శ్రీధర్ క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. పెన్షన్ పొందే లబ్ధిదారుల వివరాలు సేకరించారు. కొందరు నకిలీ సదరం సర్టిఫికెట్స్‌తో కొన్నేళ్లుగా పెన్షన్ తీసుకుంటున్నారని గుర్తించారు. ఎక్కువ సంఖ్యలో ఫేక్ వికలాంగ సర్టిఫికెట్స్‌తో పెన్షన్ పొందుతున్నారని, గ్రామంలో 104 మంది అంగవైకల్యం పెన్షన్ పొందేవారుండగా వారి సదరం సర్టిఫికెట్ అసలు లేదా నకిలీదో తేల్చడానికి ఇప్పటివరకు 70 మందిని సదరం క్యాంపునకు తరలించామన్నారు. మిగతా వారిని తరలించి ఎందరు అక్రమంగా పెన్షన్ పొందుతున్నారో తేలుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య తదితరులున్నారు.

గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



పరామర్శిస్తున్న వీరాస్వామి, తదితరులు

జమ్మికుంట: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంలేదని సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జక్కె వీరాస్వామిగౌడ్ అన్నారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు మంజాల సదయ్య తాటిచెట్టు పైనుంచి పడటంతో తీవ్రగాయాలు కాగా బుధవారం పరామర్శించారు. రాష్ట్రంలోని గీత కార్మికులందరికీ కాటమయ్య రక్షణ కవచాలు అందించి ప్రాణాలు కాపాడాలని, మృతిచెందిన, గాయాలపాలైన గీత కార్మికులకు ఆర్థికసాయం అందించాలని, మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గణపతిరాజ్‌గౌడ్, గ్రామ గౌడ సంఘం ఉపాధ్యక్షుడు చెన్నయ్యగౌడ్ తదితరులున్నారు.

నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కాట్రపల్లి కి చెందిన చిలకమారి రాజమౌళి ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు రాజు, రాజశేఖర్, తిప్ప బత్తిని రాజు, ఆవుల సదయ్య పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూరు మాజీ జెడ్పీటీసీ ఎడ్ల సుగుణాకర్ తల్లి రాధ, బీఆర్ఎస్ అన్నారం గ్రామశాఖ అధ్యక్షుడు పడకంటి వీరేశం ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను బుధవారం కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పరామర్శించారు. వెంట పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ముద్దసాని ప్రదీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామంచ గోపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు అడప శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

కొత్త బియ్యంతోనే సమస్య

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు కొత్త బియ్యం రావడంతోనే సమస్య తలెత్తిందని ఆర్సీవో అంజలి తెలిపారు. అన్నంపై వివిధపత్రికల్లో వచ్చిన వార్తలతో బుధవారం గురుకులాన్ని సందర్శించారు. విద్యార్థులను కలిసి మాట్లాడారు. ఇటీవలకు పాఠశాలకు అధికారులు కొత్త బియ్యం పంపిణీ చేయడంతో వండిన బియ్యం ముద్దగా మారి తినడానికి ఇబ్బందిగా ఉంటుందని, సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. విద్యార్థులు పలు సమస్యలు విన్నవించగా పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మికుంట: మానేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి బుధవారం తెలిపారు. మండలంలోని తనుగుల కు చెందిన జైద రామకృష్ణ, శంభునిపల్లి గ్రామానికి చెందిన వాసాల సంతోష్ ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా మడిపల్లి రైల్వే గేటు సమీపంలో పట్టుకున్నామని వివరించారు.

ఉద్యోగులపై దాడి దారుణం

హుజూరాబాద్‌రూరల్: ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి పాల్పడటం సరికాదని తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం, ప్రజలకు వారధిగా ఉండేది ఉద్యోగులపై భౌతిక దాడులు దారుణమని, ఘటనపై ప్రభుత్వం విచారణజరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

అవగాహన సమావేశం

శంకరపట్నం: తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఓటరు జాబితాపై ఆయా రాజకీయపార్టీల నాయకులతో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ ప్రీతి, నాయకులు ఆరీఫ్, సమ్మిరెడ్డి, కొండ్ర రాజయ్య, శ్రీనివాస్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలు చూపాలి

ఇల్లందకుంట: ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసినట్లు వచ్చి న ఆరోపణలపై ఆధారాలు చూపాలని కాంగ్రెస్ నాయకుడు మడిపల్లి సంతోష్ అన్నారు. బుధవారం మండలంలోని రాచపల్లి గ్రామంలో మాట్లాడారు. ఈనెల 10న గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్లపై చేసిన ఆరోపణలు నిజం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసే అధికారం గ్రామస్థాయి నాయకులకు లేదన్నారు.

వైద్యం కోసం ఎదురుచూసి వెనుదిరిగిన గర్భిణి

శంకరపట్నం: కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం వైద్యుల కోసం ఓ గర్భిణీ వైద్యం కోసం ఎదురుచూసి ఇంటికి వెనుదిరిగింది. మండలంలోని మొలంగూర్ గ్రామానికి చెందిన గర్భిణి కరీంనగర్‌లోని మాతాశిశు ఆరోగ్యకేంద్రంలోని గైనకాలజిస్ట్ వద్ద ఇటీవల వైద్యపరీక్షలు చేయించుకుంది. హీమోగ్లోబిన్ తక్కువ ఉందని రోజు విడిచి రోజు ఐరన్ ఇంజక్షన్లు తీసుకోవాలని సూచించారు. సోమవారం కేశవపట్నం పీహెచ్‌సీ డాక్టర్ పర్యవేక్షణలో స్టాఫ్‌నర్స్ ఇంజక్షన్ వేశారు. బుధవారం మళ్లీ పీహెచ్‌సీకి వచ్చారు, డాక్టర్‌తోపాటు వైద్య సిబ్బంది లేకపోవడంతో గంటల తరబడి వేచి చూసింది. డాక్టర్ పర్యవేక్షణలో స్టాఫ్‌నర్స్ ఇంజక్షన్ వేస్తారని ఏఎన్ఎం చెప్పడంతో ఏడు నెలల గర్భిణి చేసేదిలేక భర్తతో ఇంటికి వెళ్లిపోయింది. మండలంలో పనిచేస్తున్న ఓ వైద్య సిబ్బంది కూతురు పెళ్లికి పీహెచ్‌సీ సిబ్బంది వెళ్లినట్లు తెలిసింది.